

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ

విజయనగరం, జూలై 4: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (ఎన్ఏసీ) సంస్థలు సంయుక్తంగా స్కిల్‌హబ్‌ల ద్వారా శిక్షణ నిర్వహిసున్నామని నైపుణ్యాభివృద్ధ సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు తెలిపారు. కొండకరకాం సమీపంలోని కేంద్రీయ వర్సిటీ, వీటీ అగ్రహారంలోని నేక్ శిక్షణ కేంద్రం వద్ద ఈ తరగతులు ఉంటాయన్నారు. అసిస్టెంగ్ సర్వేయర్, అసిస్టెంట్ ఫ్లంబర్, ఫీల్డ్ టెక్నీషియన్/ఎయిర్ కండిషన్ మెకానిజమ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపుతామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 8121016785, 9398286654ను సంప్రదించాలని కోరారు.

ఇసుక ఇక్కట్లుండవ్!

- ‘ఉచితం’ నిర్ణయంపై ప్రజల్లో హర్షాతిరేకాలు
- త్వరలో నూతన పాలసీ ప్రకటించనున్న ప్రభుత్వం
- ఊపందుకోనున్న నిర్మాణ రంగం.. అక్రమాలకూ చెక్

ఇక ఆ ఇబ్బందులు ఉండవు.. అవసరమైన మేర ఇసుకను తెచ్చుకోవచ్చు. ధీమాగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవచ్చు. ఇసుక లేదనే బెంగ అక్కర్లేదు. ఆన్‌లైన్‌లో చెల్లింపులుండవు.. తరలింపు సమయంలో అనవసరమైన అడ్డంకులు చెప్పరు. అందరికీ అందుబాటులో ఉంటుంది కాబట్టి నదుల్లో దోపిడీకి కూడా చెక్ పడుతుంది. ఇసుక ఉచితంపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. ఇసుక బంగారమాయె అన్న పరిస్థితి నుంచి ఇసుక సాకారమాయె అన్న స్థితికి వచ్చినందుకు అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)



బొబ్బిలి డంపింగ్ యార్డులో ఇసుక నిల్వలు



2016లో చంద్రబాబు ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసింది. దీంతో అక్రమాలు ఆగాయి. పేదవారికి రీచ్‌ల్లో ఇసుక ఉచితంగా దొరికేది. జగన్ సర్కారు వచ్చాక ఉచిత ఇసుక ఎత్తేశారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఆ పార్టీ నేతలు, వారి మనుషులు నదులను పంచేసుకొని ఇసుక అమ్మకాలు జరిపారు. అడ్డూఅదుపూ లేకుండా దందా నడిపారన్న విమర్శలు వచ్చాయి. మధ్యతరగతి వర్గాలకు 20 టన్నుల లారీ ఇసుకను రూ.35 వేలపైనే అమ్మి సొమ్ము చేసుకున్నారు. పెరిగిన ధరలతో నిర్మాణరంగం కుదేలైంది. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. ఈ పరిస్థితి ఇక మారనుంది. కూటమి ప్రభుత్వం త్వరలోనే నూతన పాలసీని ప్రకటించనుంది.

భవన నిర్మాణ రంగంలో ఇసుక కీలకమైన ముడి సరుకు. ఇసుకను ఉచితం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించడాన్ని అన్ని వర్గాలూ స్వాగతిస్తున్నాయి. ముఖ్యంగా ఇసుక అక్రమాలకు చెక్ పెట్టినట్లు అవుతుందని భావిస్తున్నారు. అలాగే నిర్మాణ రంగానికి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అభిప్రాయపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. మన జిల్లాలోని నదుల నుంచి ఇసుకను తరలించేందుకు తాడేపల్లి పెద్దల హస్తం ఉండేది. అంటే అక్రమాల పరంపర ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లాలోని నాగావళి నది నుంచి పెద్ద ఎత్తున ఇసుకను భారీ లారీలతో తరలించి వందల కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఒడిశా సరిహద్దులోని చోళ్లపదం నుంచి నాగావళి నదిలో భారీ ఇసుక తవ్వకాల క్వారీని ఏర్పాటు చేసుకుని వారంలో కొన్ని వందల లారీల ఇసుకను తరలించేవారు. అక్రమ రవాణా అడ్డుకునే నాథుడు ఉండేవాడు కాదు. కనీసం ప్రశ్నించేందుకు కూడా పోలీస్, రెవెన్యూ శాఖలు సాహసం చేసేవి కావు. లారీలను ఆపి ఇసుక ఎక్కడికి వెళుతోంది అని ఆరా తీసినా బదిలీ వేటు తప్పదన్న భయాన్ని వెళ్లగక్కేవారు.

- ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలోని నగావళి, జంఝావతి, సువర్ణముఖీ, వేగావతి, చంపావతి, గోస్తనీ నదుల నుంచి అవసరమైన మేర ఇసుకను ఉచితంగా పొందవచ్చు. ఇందుకు సంబంధించిన విధి విధానాలు ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. ఈనెల 8 లేదా 9నుంచి కొత్త పాలసీ అమల్లోకి రానున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టత ఇచ్చారు.



- జిల్లాలో నిర్మాణ రంగంపై అధారపడి జీవిస్తున్న కూలీలు, కార్మికులు, ఇటుక పనుల మేస్త్రిలు ఇలా 52వేల మంది వరకు పనిచేస్తున్నారు. ఇసుక ఉచితం చేస్తే నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వారికి కూలి రేట్లు పెరిగే పరిస్థితి కన్పిస్తోంది. తద్వారా వారి జీవన విధానంలో మెరుగైన మార్పు రానుంది. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక లభ్యం కాక, కొనుగోలు చేయలేక ఈ రంగం కుదేలైంది. పనుల కోసం కార్మికులు విజయనగరం కోట జంక్షన్లో గంటల పాటు నిరీక్షించి చివరికి ఎవరూ పని కల్పించక ఇంటిబాట పట్టేవారు.

ముందుగా యార్డుల నుంచి తరలింపు..

ప్రస్తుత వర్షాకాలంలో నదుల్లో నీటి ప్రవాహాలు పెరిగే పరిస్థితి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని ఇసుక యార్డుల్లో ఉన్న ఇసుకను ముందుగా వినియోగదార్లకు అందిస్తారు. అయితే నదుల నుంచి యార్డులకు తీసుకువచ్చే రవాణా చార్జీలు, కూలీల ఖర్చులకు సంబంధించి వినియోగదారుడే భరించాల్సి ఉంటుంది. ఎంత... ఏమిటి.. అన్నది ప్రభుత్వం త్వరలో స్పష్టం చేయనుంది. జిల్లాలో బొబ్బిలి, డెంకాడ, కొత్తవలస ప్రాంతాల్లో డంపింగ్ యార్డులున్నాయి. డెంకాడలో ఇసుక నిల్వలు పూర్తి కావొచ్చాయి.

అందుబాటులో నిల్వలు..

జిల్లాలోని బొబ్బిలి, డెంకాడ, కొత్తవలస ప్రాంతాల్లో మూడు చోట్ల యార్డులున్నాయి. అందులో ఇసుక అందుబాటులో ఉంది. ఉచితం నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయాల్సి ఉంది. విధివిధానాలు వచ్చాక వివరాలు అందిస్తాం.
- చంద్రరావు, డీడీ, గనుల శాఖ

మంచి నిర్ణయం..

ఇసుక ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామం. భవన నిర్మాణ రంగానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. దీనికి తోడు అక్రమ రవాణా కట్టడి ద్వారా స్థానికంగా ఉన్న వినియోగదార్లకు ఇసుక అందేందుకు అవకాశం ఉంటుంది.
-డి.రామకృష్ణ, తాపి మేస్త్రి, విజయనగరం

అభివృద్ధే అజెండా

- అన్ని శాఖల్లో పరిస్థితిని తెలుసుకుంటున్నా
- పెండింగ్ పనులూ పూర్తి చేస్తాం
- పారాది వద్ద తాత్కాలిక రోడ్డు నిర్మాణం
- విలేకర్లతో కలెక్టర్ అంబేడ్కర్



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

‘జిల్లా అభివృద్ధే మా ప్రధాన అజెండా. అన్ని శాఖలతో సమీక్షిస్తూ పరిస్థితులను తెలుసుకుంటున్నా. పెండింగ్ పనుల వివరాలు అడిగాను. అర్ధాంతరంగా నిలిచిన ప్రాజెక్టుల నివేదిక కోరాను. ఆయా ప్రాజెక్టుల నిర్వాసితులకు న్యాయం చేస్తాం. భోగాపురం విమానాశ్రయంపైనే దృష్టి పెట్టాం’ అని కలెక్టర్ అంబేడ్కర్ జిల్లా పరిపాలనలో తన ప్రాధాన్యాలు, విధానాలను వెల్లడించారు. విజయనగరం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక వివిధ అంశాల వారీగా మొదటిసారి విలేకరులతో గురువారం మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

- పింఛన్ల పంపిణీలో మొదటి రోజునే 96.9శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీ మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయదలచింది. జిల్లాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ తంతును విజయవంతంగా పూర్తి చేశాం. ప్రణాళికాబద్ధంగా ప్లాన్ చేసుకున్నాం.
- జిల్లా నుంచి అంతర్ రాష్ట్ర రోడ్డు మార్గంగా ఉన్న బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. పూర్తి స్థాయి వంతెన నిర్మాణానికి కావాల్సిన అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. అంతవరకు తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్ణయించాం. రూ.20లక్షలతో తాత్కాలిక రోడ్డు మార్గాన్ని పునరుద్ధరిస్తాం.
- జిల్లాలో రోడ్లు చాలా చోట్ల గోతులమయంగా మారాయి. వాటిని పూడ్చి పటిష్టమైన మరమ్మతులు చేపట్టేందుకు వీలుగా చర్యలు తీసుకుంటాం.
- విజయనగరం నుంచి విశాఖ వెళ్లే మార్గంలో డెంకాడ మండలం జొన్నాడ వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు కొన్నేళ్ల క్రితం నిర్మించినది. కొత్తగా నిర్మించిన మార్గం వద్ద కాకుండా పాత రోడ్డు మార్గంలో టోల్‌గేట్ ఏర్పాటు చేసి టోల్ ఫీజు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. దీనిపై వివరాలు కనుక్కొని చర్యలు తీసుకుంటాం. టోల్‌ఫీజు కింద ఆర్టీసీ బస్సులు వివిధ కేటగిరీ బస్సుల్లో 5నుంచి 10రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. దీనిపై వివరాలు కనుక్కొని చర్యలు తీసుకుంటాం.
- జిల్లాలో వర్షపాతం సాధారణ స్థాయిలో ఉంది. అయినప్పటికీ రైతులు సాగునీరు కోసం ఇబ్బందులు పడటం క్షేత్రస్థాయిలో కన్పించింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటీవల సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీరు విడుదల చేశాం. అలాగే రైతులకు కావాల్సిన విత్తనాలు అందించాం. ఎరువులనూ అందుబాటులో ఉంచుతున్నాం.
- జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న తారకరామ తీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్ భూ సేకరణ, గ్రామాల పునరావాస పునర్ నిర్మాణ ఏర్పాట్లు, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అంశాలపై ప్రభుత్వానికి నివేదిస్తాం.
- భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణ పనులపై కూడా దృష్టి సారిస్తున్నాం. త్వరగా పనులు పూర్తయ్యేందుకు వీలుగా చర్యలు చేపడతాం.

బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా మూసేసిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు
- బంద్ అమలును పర్యవేక్షించిన విద్యార్థి సంఘాల నాయకులు





విజయనగరంలో నినాదాలు చేస్తూ ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు (ఇన్‌సెట్)లో బంద్‌కు మద్దతుగా సెలవు ప్రకటించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల

విజయనగరం దాసన్నపేట, జూలై 4: నీట్ స్కాంపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని, నీట్‌ని రద్దు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతం అయ్యింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసేశారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పీడీఎస్‌ఓ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాలు బంద్ అమలును పర్యవేక్షించాయి. జిల్లా కేంద్రంలో నిరసన కూడా తెలిపాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ, నీట్ నిర్వహణపై దేశంలో ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చినా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి సరైన స్పందన రాకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యాశాఖ మంత్రి విద్యను పట్టించుకోకపోతే ఏ శాఖ మంత్రి చూస్తారని ప్రశ్నించారు. ఇటువంటి ఎన్నో లీకులకు కారణమౌతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలన్నారు. అలాగే మేధావులను తయారు చేసే సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి నాయకులపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గణేష్, రాకేష్, రవికుమార్, రమేష్, సుమన్, రాజు, కళ్యాణి, సుస్మిత, గుణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



అల్లూరికి నివాళి అర్పిస్తూ మాట్లాడుతున్న అశోక్

విజయనగరం క్రైం/ రింగురోడ్డు, జూలై 4: స్వాతంత్ర్య సాధన కోసం విప్లవ పంథాను ఎంచుకున్న విప్లవవీరుడు, మహనీయుడుగా అందరూ కీర్తించే అల్లూరి సీతారామరాజుకు జిల్లా అధికారులు, నాయకులు, ప్రజలు ఘన నివాళి అర్పించారు. సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా అంతా విప్లవ వీరుడ్ని స్మరించారు. ఆయన పోరాట పటిమను, దేశభక్తిని గుర్తు చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి అదనపు ఎస్పీ అస్మాపరహీన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో రింగురోడ్డులో వున్న విగ్రహం ఎదుట కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు హాజరై సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, బ్రిటీష్ వారిని గడగడలాడించి స్వాతంత్ర్య సముపార్జనకు అల్లూరి ఎంతో కృషి చేశారన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ

మోడల్‌గా కెల్ల, పార్వతీపురం సంఘాలు

(విజయనగరం రూరల్)

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు(పీఏసీఎస్)ల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 95 సంఘాలు ఉండగా తొలి దశలో ప్రయోగాత్మకంగా కెల్ల, పార్వతీపురం మన్యం పీఏసీఎస్‌ల్లో ఈ కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. పీఏసీఎస్‌కి సంబంధించిన సమస్త సమాచారాన్ని కంప్యూటరీకరణ చేస్తారు. దీనికి సంబంధించి సహకార సంఘ సీఈఓతో పాటు ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.. 2018లో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినా 2019లో ప్రభుత్వ మారడంతో ఆగిపోయింది. కరోనా తరువాత ఈ ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించినా ముందుకు కదల్లేదు. తాజాగా ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ ప్రక్రియ తెరపైకి రావడం.. అంతలోనే ఆచరణ దిశగా అడుగులు పడడం జరిగింది. ఈ క్రమంలో మోడల్‌గా ఉమ్మడి జిల్లాలోని కెల్ల, పార్వతీపురం మన్యం పీఏసీఎస్‌ల్లో ఈ ప్రాజెక్టును



పూర్తిచేసి దశలవారీగా మిగతా పీఏసీఎస్‌ల్లో ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31లోగా అన్ని సంఘాల్లో పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

అమ్మకు ఇచ్చిన మాట తప్పాను

- ఉన్నత చదువులు లేనందున మంత్రి పదవికి దూరమయ్యాను
- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన వ్యాఖ్యలు

బొబ్బిలి, జూలై 4:

‘చదువు విషయంలో అమ్మకు ఇచ్చిన మాట తప్పాను.... ఉన్నత చదువులకు వెళ్లలేకపోయాను....ఫలితంగా ఇటీవల రాష్ట్ర మంత్రి పదవిని అందుకోలేకపోయాను’ అని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగా రావు(బేబీనాయన) అన్నారు. బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు కిట్ల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బేబీనాయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. చెన్నైలో పుట్టి పెరిగిన తాను బొబ్బిలి గడ్డపై మక్కువతో బాల్యంలోనే అక్కడి నుంచి బొబ్బిలి వచ్చేస్తానని మారాం చేశానని, చదువు పూర్తికాకుండా వెళ్లవద్దని అమ్మ షరతు విధించిందని, తాను డిగ్రీ కచ్చితంగా పూర్తి చేస్తానని అమ్మకు మాట ఇచ్చానన్నారు. ప్రజాజీవితంలో మునిగిపోయి చదువుకు ఆటంకం ఏర్పడిందని, ఇటీవల ఎమ్మెల్యేగా తాను గెలిచినప్పటికీ ఉన్నత చదువులు లేని కారణంగానే తనకు మంత్రి పదవి రాలేదని భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ఐ కొండపల్లి శ్రీనివాస్ ఉన్నత చదువులు చదువుకున్నారని, ఆయనకు మంత్రి పదవి రావడం తనకు ఆనందమేనని అన్నారు.

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎప్పుడూ మంచి విజన్ ఉంటుందని, బీసీల కోసం అప్పట్లోనే గురుకులాలను ఏర్పాటు చేయడం ఓ కేస్ స్టడీ లాంటిదని అన్నారు. కోమటిపల్లి గురుకులానికి సొంతస్థలం, భవనం సమకూర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంటర్మీడియట్ కోర్సు మంజూరు చేయాలని మంత్రి లోకేశ్‌ను కోరతానన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గునుపూరు పురుషోది అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దారు త్రినాథరావునాయుడు, ఎంపీడీవో రవికుమార్, ఎంఈఓలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బేబీనాయన

బిజినెస్

మరింత సులభంగా ఎస్‌బీఐ రుణాలు

న్యూఢిల్లీ: రుణాల మంజూరు ప్రక్రియను ఎస్‌బీఐ మరింత సులభం చేసింది. బ్యాంకు 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇందుకోసం అనేక చర్యలు ప్రకటించింది. వ్యవసాయ రుణాల్లో ఉండే నష్ట భయాన్ని (రిస్క్) సరిగా అంచనా వేసి, వేగంగా రుణాలు మంజూరు చేసేందుకు కొత్తగా 35 కేంద్రీకృత వ్యవసాయ ప్రాసెసింగ్ సెల్స్ (ఏసీపీసీ) ఏర్పాటు చేసింది. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై రుణాల మంజూరు కోసం తన ఎండ్ టు ఎండ్ డిజిటల్ యాప్ యోనో, భీమ్ ఎస్‌బీఐ పే యాప్‌లో రెండు ప్రత్యేక ఫీచర్లు జోడించింది. ఎస్‌బీఐ సూర్య ఘర్ లోన్ మంజూరు ప్రక్రియనీ సులభతరం చేసింది. ప్రవాస భారతీయుల బ్యాంకింగ్ అవసరాలు తీర్చేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంది.

బైజూస్ జీతాలు చెల్లించాల్సిందే

ఎన్‌సీఎల్‌టీ

బెంగళూరు: ఎడ్యు స్టార్టప్ బైజూస్‌కి ఎన్‌సీఎల్‌టీ బెంగళూరు బెంచ్ గట్టి హెచ్చరిక చేసింది. ముందు ఉద్యోగుల జీతాల బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. లేకపోతే బైజూస్ ఆదాయ, వ్యయాల పుస్తకాలను ఐసీఏఐ ద్వారా ఆడిట్ చేయించాల్సి ఉంటుందని హెచ్చరించింది. రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించిన 20 కోట్ల డాలర్లు తమకు అందుబాటులో లేనందున ఇప్పటికిపుడు ఉద్యోగుల జీతాలు చెల్లించడం సాధ్యం కాదన్న బైజూస్ వాదనని ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. బైజూస్ ఇప్పటికే నడుస్తున్న బిజినెస్ సంస్థ కాబట్టి, వచ్చే ఆదాయం నుంచి ఉద్యోగుల జీతాలు చెల్లించడం పెద్ద సమస్య కాదని స్పష్టం చేసింది.

పదేళ్ల గరిష్ఠ స్థాయిలో ఇళ్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఆరు నెలల్లో 1,73,241 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. గత పదేళ్లలో ఎన్నడూ ఈ నగరాల్లో ఇన్ని ఫ్లాట్లు, ఇళ్లు అమ్ముడుపోలేదని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది.

హైదరాబాద్‌లో మరింత పైకి: హైదరాబాద్ రియల్టీ గత ఆరు నెలల్లో 18,573 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ముంబై, ఢిల్లీతో సహా దేశంలో మరే ప్రధాన నగరంలోనూ ఇంత భారీ వృద్ధిరేటు నమోదు కాలేదు. ఆఫీసు స్పేస్ లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ కోసం లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 71 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

మార్కెట్ దూసుకెళ్తోంది.. జర జాగ్రత్త!



సెబీ, శాట్‌కు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన

మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సలహా..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న తరుణంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీతో పాటు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సూచించారు. అంతేకాదు, వ్యవస్థ సుస్థిరత కోసం శాట్ మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మార్కెట్ లావాదేవీలు భారీగా పెరగడంతోపాటు ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలు అమలులోకి తెస్తున్న నేపథ్యంలో ట్రిబ్యునళ్లపై పనిభారం గణనీయంగా పెరిగిందని, ఈ నేపథ్యంలో అధికారులు కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలన్నారు. శాట్ కొత్త కార్యాలయంతోపాటు కొత్త వెబ్‌సైట్‌ను గురువారం ప్రారంభించిన సందర్భంగా చీఫ్ జస్టిస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ పెట్టుబడులకు చట్టాలు రక్షణ కల్పించగలవని, వివాదాలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థలున్నాయని ఎప్పుడైతే మదుపరులు భావిస్తారో.. వారు మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలుంటాయని, అలాంటి వాతావరణం దేశంలో పెట్టుబడుల పెరుగుదలకు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. స్వలాభం కోసం ఒకరికొకరు హాని చేసుకునే ఆర్థిక ప్రపంచంలో శాట్ రిఫరీ పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. అందరూ నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. మార్కెట్ సత్ప్రవర్తన, కార్పొరేట్ పాలన ప్రమాణాల అంశాలకు సంబంధించి శాట్ వద్ద అప్పీళ్ల కొన్ని రెట్లు పెరిగిన నేపథ్యంలో ట్రిబ్యునల్ సమర్థవంతంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు శాట్‌లో ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని సూచించారు.

మోసగాళ్లపై సమాచారం ఇవ్వండి: బుచ్

మార్కెట్లో తప్పుడు పనులకు పాల్పడుతున్న వారి సమాచారం ఇవ్వాలని సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మార్కెట్ వర్గాలను కోరారు. స్వప్రయోజనాల కోసం తప్పుగా ప్రవర్తించే వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా తప్పుడు ప్రవర్తన వ్యవస్థాగత సమస్యగా రూపుదాల్చకుండా, మరిన్ని కఠిన నిబంధనలు ప్రవేశపెట్టే అవసరం లేకుండా వీలైనంత త్వరగా చర్యలు చేపట్టడమే సెబీ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

2025 డిసెంబరు నాటికి సెన్సెక్స్ 1,00,000?

ఐదేళ్లకోసారి రెండింతలవుతున్న ఇండెక్స్

ముంబై: బీఎస్ఈ సెన్సెక్స్ గతంలో సాధించిన వృద్ధిని బట్టి చూస్తే, 2025 డిసెంబరు నాటికి 1,00,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. గడిచిన 45 సంవత్సరాల్లో సెన్సెక్స్ 15.9 శాతం సంచిత వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) నమోదు చేసుకుంది. 1979 ఏప్రిల్‌లో 100 బేస్ పాయింట్లతో ఏర్పాటైన సెన్సెక్స్.. ఇప్పటివరకు 800 రెట్ల వృద్ధిని సాధించింది. 15.9 శాతం సీఏజీఆర్‌ను మున్ముందూ కొనసాగించగలిగితే వచ్చే ఏడాది డిసెంబరు నాటికల్లా లక్ష పాయింట్లకు చేరుకోగలదని ఓ ఆంగ్ల దినపత్రిక కథనం అంచనా వేసింది. స్వల్పకాలంలో ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం సూచీలు వృద్ధి పథంలోనే పయనించనున్నాయని అంటోంది.

మార్కెట్ పర్యవేక్షణ కోసం కేబినెట్ మంత్రిని నియమించాలి..

సెన్సెక్స్ ప్రస్తుత 15.9 శాతం సీఏజీఆర్‌తో ప్రతి ఐదేళ్లకు రెట్టింపవుతూ వచ్చిందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ అన్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే, 2029 నాటికి సెన్సెక్స్ 1,60,000కు చేరుకోగలదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, దేశీయ క్యాపిటల్ మార్కెట్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేబినెట్ సహాయ మంత్రిని నియమించాలని సూచించారు.

80,000 ఎగువన ముగిసిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ సూచీలు గురువారం సరికొత్త ఉన్నత శిఖరాలకు చేరుకున్నాయి. క్రితం సెషన్‌లోనే 80,000 మైలురాయిని తాకి వెనక్కి వచ్చిన సెన్సెక్స్.. తొలిసారిగా ఆ స్థాయికి ఎగువన ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం ఇందుకు తోడ్పడింది. సెన్సెక్స్ ఒకదశలో 400 పాయింట్ల మేర ఎగిసి 80,392.64 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 62.87 పాయింట్ల లాభంతో మరో జీవితకాల గరిష్ఠ స్థాయి 80,049.67 వద్ద స్థిరపడింది. 24,401 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన నిఫ్టీ చివరికి 15.65 పాయింట్ల లాభంతో 24,302.15 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును సైతం రికార్డు చేసింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.4,47,30,452.99 కోట్లకు (5.36 లక్షల కోట్ల డాలర్లు) దూసుకుపోయింది.

కడప దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీలో కొత్త యూనిట్ ప్రారంభం

న్యూఢిల్లీ: దాల్మియా భారత్ ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో నిర్మించిన కొత్త యూనిట్‌లో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమయింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 2.6 ఎంటీపీఏ కాగా కొత్త యూనిట్‌తో అదనంగా 1.0 ఎంటీపీఏ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ విస్తరణతో తమ కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 46.6 ఎంటీపీఏకు పెరుగుతుందని పేర్కొంది.

డీసీఐకి రూ.156.5 కోట్ల కాంట్రాక్టు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి (డీసీఐ) రూ.156.5 కోట్ల విలువైన కొత్త కాంట్రాక్టు లభించింది. కొచ్చిన్ పోర్టులో ఏటా నిర్వహించే డ్రెడ్జింగ్ పనుల కాంట్రాక్టును డీసీఐ దక్కించుకుంది. కాంట్రాక్ట్‌లో భాగంగా కొచ్చిన్ పోర్టు అవుటర్ ఛానల్, అప్రోచ్ ఛానల్, ఐసీటీటీ బేసిన్, ఎల్ఎన్‌జీ బేసిన్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుందని వివరించింది. మరో ఏడాది పొడిగించే నిబంధనపై ఈ కాంట్రాక్టు తమకు దక్కిందని డీసీఐ తెలియచేసింది.

పదేళ్లలో ఫార్మా ఎగుమతులు 13,000 కోట్ల డాలర్లు

ప్రస్తుతం 2500 కోట్ల డాలర్లు; తెలంగాణ వాటా 35 శాతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ఫార్మా ఎగుమతులు వచ్చే పదేళ్ల కాలంలో 13000 కోట్ల డాలర్లకు (రూ.10.85 లక్షల కోట్లు) చేరనున్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇప్కా) ప్రెసిడెంట్ డాక్టర్ బి.పార్థసారథి రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల పరిమాణం 2500 కోట్ల డాలర్లున్నదని (రూ.2.08 లక్షల కోట్లు), అందులో ఒక్క తెలంగాణ వాటానే 35 శాతం ఉందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరుగనున్న 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ) వివరాలు తెలియచేయడానికి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ఔషధ మార్కెట్‌కు భారత్ ఎన్నో కీలక ఔషధాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రపంచ మార్కెట్లో భారత ఫార్మాను మరింత విస్తరించి, పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. ప్రపంచ ఫార్మా రంగ ప్రముఖులందరినీ ఒకే వేదిక పైకి తెచ్చి ఫార్మా రంగాన్ని మరింత ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఐపీసీ నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచంలోని భిన్న దేశాలకు చెందిన 12 వేల మంది ప్రతినిధులు, 74 మంది వక్తలు ఈ సదస్సుకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పది సంవత్సరాల తర్వాత ఇంత భారీ స్థాయిలో ఐపీసీ సదస్సు హైదరాబాద్ వేదికగా జరుగుతోందని ఆయన వెల్లడించారు.

ప్లేస్‌మెంట్ కాంక్లేవ్

ఫార్మా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం ఐపీసీలో భాగంగా ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ఐపీఏ అధ్యక్షుడు టీవీ నారాయణ చెప్పారు. పలు ఫార్మా కంపెనీలు ఇందులో పాల్గొని విద్యార్థుల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, అర్హులైన వారికి ప్లేస్‌మెంట్ లేఖలు కూడా అందచేయనున్నాయని ఆయన తెలిపారు. ఐపీసీలో ఇలాంటి ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. అలాగే స్టార్టప్‌ల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థులు తమ ఊహాత్మక ప్రాజెక్టులను ఇక్కడ ఆవిష్కరించినట్టయితే ఉత్తమ ఆవిష్కరణను కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం, అందచేయనున్నట్టు ఆయన చెప్పారు.

డబ్ల్యూహెచ్ఓ అభియోగంలో నిజం లేదు

భారతదేశంలో తయారవుతున్న ఔషధాల్లో 35 శాతం కల్తీ ఔషధాలే అన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికను ఐపీసీ ప్రతినిధులు ఖండించారు. తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాల కోసం ప్రపంచం యావత్తు భారతదేశం వైపే చూస్తున్నదన్నారు. ప్రపంచ ఫార్మాగా ప్రసిద్ధి చెందిన మన దేశం కొవిడ్ సంక్షోభ కాలంలో 150 పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిందని, అలాగే ఎన్నో కీలకమైన వ్యాక్సిన్లు ప్రపంచానికి అందించి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నదని గుర్తు చేశారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,090 ▲	67,000 ▲	97,500
ముంబై	72,470 ▲	66,380 ▲	90,020

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	122
కర్నూలు	112	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		

నవ్య | చిత్రజ్యోతి

వేడుకగా నటి వరలక్ష్మి వివాహ రిసెప్షన్

తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు







సినీ నటి వరలక్ష్మి, ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ల వివాహం రిసెప్షన్ బుధవారం రాత్రి చెన్నైలోని ఓ నక్షత్ర హోటల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు మంత్రి ఉదయనిధి, మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి డి.జయకుమార్, శశికళతో సహ పలువురు రాజకీయ నేతలు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటులు శివకుమార్, విజయకుమార్, నాజర్, నెపోలియన్, ప్రభుదేవా, ఆర్య, సిద్ధార్థ్, జీవా, అరవింద్ స్వామి, గౌతం కార్తీక్, మోహన్‌బాబు, సుదీప్, జాకీ ష్రాఫ్, తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన బాలకృష్ణ, వెంకటేష్, అల్లు అరవింద్, సినీ నటి ఖుష్బూ, ఆండ్రియా, సుకన్య, దేవయాణి, రమ్యకృష్ణ, రోజా, సుహాసిని, సీత, సంగీత దర్శకులు దేవ, శ్రీకాంత్ దేవా, తమన్, దర్శకులు భారతీరాజా, ఎస్ఏ చంద్రశేఖరన్, మణిరత్నం, కేఎస్ రవికుమార్, పి.వాసు, బాలా, సురేష్ కృష్ణ, ఆర్కే సెల్వమణి, చేరన్, ఐశ్వర్య రజనీకాంత్, ఎ.వెంకటేశ్, ఏఎల్ విజయ్, అట్లీ, వసంత్‌బాలన్, నిర్మాతలు ఆర్బీ చౌదరి, ఏఎం రత్నం, ఐసరి కె.గణేష్‌తో పాటు అనేక మంది పాల్గొన్నారు. వివాహానికి ముందు జరిగిన సంగీత్ కార్యక్రమంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, నటి త్రిష పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

డబ్బింగ్ పనుల్లో విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌కు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. అత్యున్నత స్థాయి వీఎఫ్ఎక్స్‌తో తెరకెక్కుతోన్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో హనుమంతుడి భక్తుడిగా చిరంజీవి కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎమ్.ఎమ్.కీరవాణి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/nDerGdD లో చదవండి.

సమస్యలివి... పరిష్కారాలేవి?

నంది అవార్డులు ఏవీ?

ఒకప్పుడు నంది అవార్డుల ఉత్సవమంటే సినిమావాళ్లకు ఓ పండుగ! అవార్డుల ప్రదానోత్సవాలు కూడా అంత ఘనంగా జరిగేవి. నటులకు ప్రోత్సాహకంగా ఉండేది. రెండు రాష్ట్రాలు విడిపడిన తర్వాత నంది అవార్డుల ప్రస్తావనే లేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో 'సింహ' పేరుతో చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అవార్డుల కోసం ఎంట్రీలు కూడా స్వీకరించింది. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ పదేళ్ల నుంచి తెలంగాణలో అవార్డుల ఊసే లేదు.

ఆంధ్రాలో పరిస్థితీ అంతే

ఆంధ్రప్రదేశ్‌లో ఇంతకుముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో మూడేళ్ల కాలానికి సంబంధించి ఒకేసారి కమీటీలు వేసి, నంది అవార్డులు ప్రకటించింది. అంతకుముందు రెండేళ్లుగా కూడా నంది అవార్డులు ఇవ్వకపోవడంతో ఒకేసారి వేడుక నిర్వహించి మొత్తం ఐదేళ్ల కాలానికి ఒకేసారి నంది అవార్డులు ఇవ్వాలని ప్లాన్ చేసింది. ఇంతలో ఎన్నికలు జరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారం కోల్పోయి, జగన్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించింది. ఆయన నంది అవార్డుల గురించి పట్టించుకోనే లేదు. ఇటీవల తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డుల పేరు మార్చి.. గద్దర్ పేరిట సినిమాలకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అయితే ఆ తర్వాత దీని గురించి ప్రాథమికంగా కూడా చర్చ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి కానీ, విడివిడిగా కానీ చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చిత్ర పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

పరిశ్రమగా గుర్తించాలి

సినిమాను ఒక పరిశ్రమగా గుర్తించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. అలా చేయడం వల్ల అనేక రాయితీలు లభిస్తాయి. ఫలితంగా చిత్ర నిర్మాణ వ్యయం తగ్గుతుంది. థియేటర్లు నిర్వహించేవారికి వెసులుబాటు కలుగుతుంది. ఖర్చులు కలసి వస్తాయి. రాయితీల కారణంగా చిత్ర నిర్మాణాల సంఖ్య పెరిగి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదాయం పెరుగుతుంది.

టికెట్ ధరల తికమక

సినిమా టికెట్ ధరలు పెంచే అధికారం ప్రభుత్వాలకు ఉంది. చిత్ర నిర్మాణ వ్యయం అంచనాలకు మించి పెరిగిన నేపథ్యంలో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకోవడానికి టికెట్ ధరలు పెంచుకోవడానికి భారీ చిత్ర నిర్మాతలు విడుదలకు ముందు ప్రభుత్వాలను అభ్యర్థించడం ఇటీవలి కాలంలో ఓ అలవాటుగా మారింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- రూ. వంద కోట్ల బడ్జెట్ దాటిన సినిమాలకు ధరలు పెంచుకోవటానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. అయితే కొన్ని సార్లు బడ్జెట్ ఎక్కువ అయినా నిర్మాతలు ఖర్చును తక్కువగా చూపిస్తారు. దీని వల్ల గత ఏడాది రెండు పెద్ద సినిమాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతే కాకుండా ఎంత కాలం సినిమా టికెట్ ధరలు పెంచుకోవచ్చనే విషయంపై కూడా అస్పష్టత ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కల్కి సినిమాకు 14 రోజులు ధర పెంచటానికి ఇచ్చిన జీఓపై కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. కొన్ని సినిమాలకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చినా , ఆంధ్రా ప్రభుత్వం మొండిచేయి చూపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల రెండు రాష్ట్రాలు కలిపి టిక్కెట్ల ధర విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తే బావుంటుందని సినీ వర్గాలు కోరుకుంటున్నాయి. ఇదే విధంగా బుక్‌మై షో వంటి యాప్‌లకు ప్రేక్షకులు అదనంగా సర్వీస్ టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 250 రూపాయల టికెట్ ధరకు అదనంగా సుమారు 49 రూపాయలు బుక్‌మై షో కు చెల్లించాల్సి వస్తోంది. ఇలా కాకుండా ప్రభుత్వమే టికెట్లు విక్రయించే విధంగా యాప్‌లను అభివృద్ధి చేస్తే బావుంటుందంటున్నారు. జగన్ ప్రభుత్వం ఈ తరహా యాప్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇది కార్యరూపం దాల్చలేదు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

చిన్న సినిమాలూ బతకాలి!


ప్రతి ఏడాది తెలుగులో సుమారు 100 సినిమాలు విడుదల అవుతుంటాయి. వాటిల్లో పది నుంచి పదిహేను మాత్రమే పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే చిన్న సినిమాలు బతకాలంటే వాటికి ప్రత్యేకంగా రాయితీలు ప్రభుత్వ పరంగా ప్రకటించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చలు కూడా జరిగాయి. కానీ వాటిల్లో పురోగతి లేదు. థియేటర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న చిన్న చిత్రాల నిర్మాతలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చి ఐదో ఆటగా చిన్న సినిమాను ప్రదర్శించుకోవడానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. ఈ విషయం మీద కూడా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే రాష్ట్రం విడిపోక ముందు సందేశాత్మక, ప్రయోగాత్మక చిత్రాలకు పది లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించేది. ఆ తరహా చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఇది ఉపయుక్తంగా ఉండేది. అటువంటి విధానాన్ని మళ్లీ చేపట్టాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

డిజిటల్ చార్జీలు కంట్రోల్ చేయలేమా?

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లోనే క్యూబ్(డిజిటల్ ఫార్మాట్‌లో చిత్రాల ప్రదర్శన) చార్జీలు ఎక్కువ. గతంలో ప్రింట్ల విధానం ఉండేది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లు డిజిటలైజ్ అయ్యాయి. దీని వల్ల ప్రేక్షకుల సంఖ్యతో నిమిత్తం లేకుండా- ఒక షో వేస్తే క్యూబ్‌కు కూ. 6500 చెల్లించాల్సిందే. ముఖ్యంగా సింగిల్ థియేటర్ యజమానులు ఈ పద్ధతి వల్ల చాలా నష్టపోతున్నారు. డిజిటల్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే సింగిల్ థియేటర్లకు మేలు జరుగుతుంది. . లేకపోతే నష్టాలు భరించలేక ఎక్కువ థియేటర్లు కల్యాణ మండపాలుగానో.. షాపింగ్ మాల్స్‌గానో మారిపోయే అవకాశముంది.

ప్రభుత్వానికి అండగా నిలుస్తాం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో టాలీవుడ్ చిత్ర పరిశ్రమ అన్ని వేళలా తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) తెలిపింది. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దిల్‌రాజు, కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, కే శివప్రసాదరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో చిత్ర పరిశ్రమ ప్రభుత్వానికి అండగా నిలిచింది, ఇకపైనా తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపింది. డ్రగ్స్ సైబర్ నేరాల కట్టడిలో నటీనటులు, దర్శక నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్స్ యాజమాన్యాలు తమవంతు సహకారాన్ని అందిస్తారు, దీనిపై త్వరలో ముఖ్యమంత్రిని కలసి చర్చిస్తాం' అని టీఎఫ్‌సీసీ తెలిపింది.




'జాయింట్ నంది అవార్డ్స్'...

తెలుగు సినీ రంగానికి సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో పైరసీ సమస్య ఒకటి. మరొకటి టికెట్ రేట్లు. అలాగే విద్యుత్ చార్జీలు కూడా తగ్గిస్తే.. పరిశ్రమకు మేలు జరుగుతుంది. తెలుగు సినీ రంగానికి తోడ్పడేలా ఇరు రాష్ట్ర ముఖ్యమంత్రులు కలిపి 'జాయింట్ నంది అవార్డ్స్' ప్రకటిస్తే బాగుంటుంది. ఒక సంవత్సరం హైదరాబాద్‌లో, ఇంకో సంవత్సరం అమరావతిలో ఆ వేడుకలను జరపాలి. ఇలా చేస్తే తెలుగు సినిమాకు.. తెలుగు వారికి మరింత ప్లస్ అవుతుంది.

- డి.సురేశ్‌బాబు, నిర్మాత

నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది



రాష్ట్రాలు రెండే కాని.. తెలుగు సినిమా రెండు రాష్ట్రాల్లోనూ ఆడుతోంది. గత ప్రభుత్వాలతో పోల్చితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు సినీరంగ అభివృద్ధికి, తోడ్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఇద్దరు ముఖ్యముంత్రులు కలసి మళ్లీ నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది. ఈ నిర్ణయం తెలుగు ప్రజలకు ఆనందం కలిగిస్తుంది. రేపు ముఖ్యమంత్రులిద్దరూ కలసి చర్చలు జరిపే నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కళాకారులకు ఏదో ఒక పేరుతో అవార్డులు ప్రకటిస్తే బాగుంటుంది.

- ఎస్.వి.రామారావు, సినీ చరిత్రకారుడు

ఐటీఐలో బాలికలకు ఏదీ అవకాశం?



బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ

● సాంకేతిక విద్యకు దూరమవుతున్న వైనం

బొబ్బిలి: ఉత్తరాంధ్రలో విశాఖ తరువాత బొబ్బిలిలోని ప్రభుత్వ ఐటీఐకి మంచి గుర్తింపు ఉంది. కానీ బాలికలు ఇక్కడ చేరేందుకు అవకాశాలు లేవు. దీంతో వారు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. బొబ్బిలి పట్టణంలో 1963లోనే ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఏర్పాటైంది. గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి కోసం నైపుణ్యాలు అందించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెషినిస్టు, మోటారు మెకానిక్, డ్రాఫ్టుమెన్ మెకానికల్, డీజిల్ మెకానిక్, వెల్డర్ వంటి ట్రేడులు ఉన్నాయి. ఇందులో డీజిల్ మెకానిక్, వెల్డర్ ఏడాది కోర్సులు కాగా మిగిలినవన్నీ రెండేళ్ల కోర్సులు. ఎన్‌సీవీటీ ఎఫిలియేటెడ్‌తో వీటిని నిర్వహిస్తున్నారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, రేడియో అండ్ టీవీ మెకానిజమ్ వంటి కోర్సులకు ఆదరణ లేకపోవడంతో వాటిని ఎత్తేశారు. ఇవి కాకుండా లైట్ మోటారు వెహికల్ డ్రైవింగ్, ప్లంబింగ్, కంప్యూటర్ కోర్సులు, వైరింగ్, వంటి స్వల్పకాలిక శిక్షణ కోర్సులు ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. కానీ ఈ కోర్సుల్లో బాలికలకు మాత్రం ప్రవేశం లేదు. దీంతో ఈ ప్రాంతంలోని విద్యార్థినులు సాంకేతిక శిక్షణకు దూరమవుతున్నారు.

బాలికల కోసం కోర్సులను ప్రవేశపెట్టాలి..



బాలికలు వృత్తి పరమైన అంశాల్లో మరింత నైపుణ్యం సాధించేందుకు ఐటీఐలలో వివిధ కోర్సులను ప్రవేశపెట్టాలి. వాటిలో ప్రవేశం కల్పించాలి. విశాఖపట్టణంలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ కోర్సులలో తగిన శిక్షణ ఇవ్వడం అవసరం. బొబ్బిలి ఐటీఐలో ప్రత్యేకించి మహిళలకు అవసరమైన పలురకాల కోర్సులను ప్రవేశపెట్టాలి.

-కె.పుణ్యవతి, ఐద్వా నాయకురాలు, బొబ్బిలి



కంప్యూటర్ సహాయంతో మోటారు వాహనాల డ్రైవింగ్ శిక్షణ

డిమాండ్ ఉన్న కోర్సులకు ప్రతిపాదన పంపిస్తాం..

బొబ్బిలి ఐటీఐలో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకున్నాం. మహిళలకు ప్రోత్సాహకరంగా అవసరమైన కోర్సులు ప్రవేశ పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. డిమాండ్‌లేని ట్రేడులను ఎత్తివేశాం. వాటి స్థానంలో ఆర్ అండ్ ఏసీ, కంప్యూటర్, ఫ్యాషన్ టెక్నాలజీ తదితర కోర్సుల మంజూరుకు కృషి చేస్తున్నాం. ఈ మేరకు స్థానిక ఐటీఐ నుంచి ప్రతిపాదనలు వస్తే వాటిని ప్రభుత్వానికి పంపించి మంజూరు చేయిస్తాం.

-రమణ, రీజనల్ డిప్యూటీ డైరెక్టరు, సాంకేతిక విద్య, విశాఖపట్నం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కలెక్టరేట్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు అర్హత గల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పది సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకుని ఉపాధ్యాయులు ఆయా ప్రధానోపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలను నేరుగా వెబ్‌సైట్‌లో ఈనెల 15 లోగా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

డీ పట్టా భూములు కబ్జా చేయకుండా కాపాడాలి

కలెక్టరేట్: ప్రభుత్వం ఇచ్చిన డీ పట్టా భూములు కబ్జా జరగకుండా చర్యలు తీసుకోవాలని గుర్ల మండలం దేవుని కణపాక గ్రామానికి చెందిన గిరిజనులు గురువారం కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. 1979లో అప్పటి ప్రభుత్వం డి.పట్టా భూమలు ఇచ్చిందని, తాము సాగు చేస్తున్నామని అయితే కొంతమంది బీసీలు దీనిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట: శృంగవరపుకోట మండలం పోతనాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సీతంపేట, వినాయకపల్లి, దొగ్గపేట, తలారి, ఉసిరి, ఎస్.జీ.పేట, వెంకటరమణపేట, కొత్తూరు, శివరామరాజుపేట, వశి,తిమిడి, వేచలపూడి గ్రామాలకు శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వుంటుందని అధికారులు తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మత్తు పనులు చేపడుతుండడంతో సరఫరాను ఆపు తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌలుదారులను గుర్తించాలి

రాజాం: కౌలుదారులను గుర్తించి లక్ష్యాలను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు ఆదేశించారు. గురువారం అంతకాపల్లి సచివాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్‌ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రతి పంచాయితీకి 33 కార్డులకు తక్కువ లేకుండా కౌలుదారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎం.రేణుకాసాయి, ఆర్ఐ అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికవేత్త రోశయ్య..

రాజాం/రూరల్: కొణిజేటి రోశయ్య ఆర్థికవేత్త అని పేర్కొన్నారు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాంశాఖ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్ రాజాంలో రోశయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకులు శీమకుర్తి ప్రసాద్, వాకచర్ల వెంకట పైడిరాజు, కట్టమూరి జగన్మోహనరావు, వేటూరి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేలకు పోషకాలు

వేపాడ: నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల నేలకు పుష్కలంగా పోషకాలు అందుతాయని తద్వారా అధిక దిగుబడులను పొందవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు అన్నారు. వీలుపర్తి, రాయుడుపేట గ్రామాలను ఆయన సందర్శించారు.

భూమిలో కలిసిపోయే సంచులు అందజేస్తాం

రాజాం రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించే చర్యల్లో భాగంగా త్వరగా భూమిలో కలిసిపోయే సంచులను ప్రజలకు సరఫరా చేస్తామని రాజాంకు చెందిన వికాస తరంగిణి సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ సంస్థ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి సారథ్యంలో సభ్యులు రాజాం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడిని గురువారం కలిశారు. ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోవడంతో పర్యావరణానికి ఇబ్బంది కలుగుతోందని ఆయన కమిషనర్‌కు వివరించారు.



కమిషనర్‌ను కలిసిన వికాస తరంగిణి సభ్యులు

బంకుల్లో సౌకర్యాలు పట్టవా?

● కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

విజయనగరం రింగురోడ్డు, జూలై 4: పెట్రోల్ బంకుల నిర్వహణ ఆసాంతం వ్యాపారపరంగా సాగుతోంది. వాటిలో ప్రజలకు కనీస సౌకర్యాలు అందించడం లేదు. కొన్నిచోట్ల మొక్కుబడిగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసి నిర్వహణను వదిలేస్తున్నారు. ఈ పరిస్థితిపై గత నెల 30న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో 'నిబంధనలకు బంక్' శీర్షికన కథనం వెలువడింది. దీనిపై స్పందించిన కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు. రెవెన్యూతో పాటు తూనికలు కొలతలు శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే తూనికలు, కొలతల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టగా రెవెన్యూ అధికారులు మాత్రం కదలడం లేదు. వారు మొక్కుబడి పరిశీలనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిసింది. పెట్రోల్ బంకుల్లో ఎక్కడా కనీస సదుపాయాలు లేవు. వాహనాల టైర్లకు గాలి నింపే ఏర్పాట్లు లేవు. టాయిలెట్స్ ఉండవు. ఉన్నా నిర్వహణ అధ్వానమే. ప్రతి బంకు వద్ద తాగు నీటి సౌకర్యాలుండాలి. ఎక్కడా కానరావటం లేదు. ఇలా ఎక్కడా ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోయినా వీటిని గుర్తించడం లేదు. ఎన్ని కేసులు నమోదు చేశారని ప్రశ్నిస్తే పౌర సరఫరాల శాఖ స్పష్టత ఇవ్వడం లేదు. కలెక్టర్ ఆదేశించడంతో కొన్ని బంకుల్లో తూతూ మంత్రంగా దర్యాప్తు జరిపారని తెలిసింది. ఆ వివరాలను మీడియా దృష్టికి తేవడం లేదు. దర్యాప్తు వివరాల కోసం పౌర సరఫరాల అధికారిని సంప్రదించినా స్పందించడం లేదు.



పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

ప్రసూతి మరణం సంభవిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, జూలై 4: ఇక నుంచి జిల్లాలో ఒక్క ప్రసూతి మరణం సంభవించినా ఆయా శాఖ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లా డివిజన్ స్థాయి ప్రసూతి, పెరినాటల్ చైల్డ్ డెత్ సర్వేలెన్, రెస్పాన్స్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలోని ఏడు మాతృశిశు మరణాలు సంభవించగా, వాటిపై కలెక్టరు సమీక్షించారు. ఆయా మరణాలకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇక నుంచి జిల్లాలో ఒక్క మాతృశిశు మరణం కూడా సంభవించడానికి వీల్లేదన్నారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడాలని, మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. వైద్యరోగ్య సిబ్బంది ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఏమరపాటుగా ఉన్నా ప్రజలు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు గురిస్తే వైద్యాధికారులు, జిల్లా అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని మరణాలు ఎందుకు సంభవిస్తున్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఆశావర్కర్ల, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఉండి కూడా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇక నుంచి ఎక్కడైనా ప్రసూతి మరణం సంభవిస్తే ఆయా అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి భాస్కర్ రావు, డీసీహెచ్ఎస్ గౌరిశంకర్, అధికారులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు అంబేడ్కర్

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో సూర్యకళ

శృంగవరపుకోట, జూలై 4: శృంగవరపుకోట పౌరసరఫరాల శాఖ ఎం.ఎల్.ఎస్ పాయింట్ గోదాంను గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి సూర్యకళ తనిఖీలు నిర్వహించారు. గోదాంలో ఉన్న పౌరసరఫరాల బియ్యం వంటి సరుకుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ ఉన్నారు.

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఆంధ్రక్రికెట్ అసోయేషియన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన అంతర్ జిల్లాల టోర్నీలో విజయనగరం జట్టు, ప్రకాశం జిల్లా జట్టుపై 138 పరుగులతేడాతో విజయం సాధించింది. మూడురోజుల ఫార్మెట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలిఇన్నింగ్స్‌లో జిల్లా జట్టు 255 పరుగులు సాధించగా ప్రకాశం జిల్లా జట్టు తొలి ఇన్నింగ్‌లో 161 పరుగులకు ఆలౌట్ అయ్యి 94 పరుగులు వెనుకబడింది. రెండో ఇన్నింగ్‌లో జిల్లా జట్టు 210 పరుగులకు ఆలౌట్ కాగా ప్రకాశం జట్టు మూడోరోజు గురువారం 166 పరుగులకు ఆలౌట్ అయ్యి 138 పరుగుల తేడాతో ఓడిపోయింది. విజయం సాధించిన ఆదిత్య జట్టు క్రీడాకారులను, కోచ్‌బహాదూర్‌ను అసోషియేషన్ కార్యదర్శి ఎంఎల్‌రాజు, కోశాధికారి సీతారామరాజు, వర్మ, బంగార్రాజు అభినందించారు.

ఇంకా జగన్ భ్రమలోనే..

జామి, జూలై 4: సచివాలయాల్లో ఉద్యోగులు ఇంకా జగన్‌మోహన్‌రెడ్డిని తమ ముఖ్యమంత్రిగా భావించి.. సచివాలయాలపై అతని బొమ్మను ఉంచుతున్నారని టీడీపీ, జనసేన నాయకులు మండిపడుతున్నారు. గురువారం చింతాడ, కుమరాం గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు మాట్లాడుతూ ప్రభుత్వం మారి నెల రోజులు కావస్తున్నా... సచివాలయాలపై ఇంకా జగన్ ఫొటోలు ఉంచారని ఆరోపించారు. ప్రభుత్వం మారిందని...వాటిని తొలగించాలని సచివాలయ సిబ్బందిని కోరుతున్నా...తమ మాటను పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై ఎంపీడీవో తిరుమలరావును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే సచివాలయంపై ఉన్నబొమ్మలు తొలగించాలని... ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలు ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. దీనిపై విచారణ చేపడతానని తెలిపారు.



కుమరాం సచివాలయంపై జగన్ ఫొటో

కలెక్టర్‌ను కలిసిన కోండ్రు

రాజాం: నూతన కలెక్టర్ అంబేడ్కర్‌ను గురువారం రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, ఆయన సోదరుడు జగదీష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. రాజాంలో ప్రధాన రహదారి నిర్మాణం విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోండ్రు కోరారు. తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం ప్రాజెక్టుల ద్వారా ఈ ఏడాది రైతులకు సకాలంలో సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



కలెక్టరుకు బొకే అందజేస్తున్న కోండ్రు సోదరులు

విజయనగరం రూరల్/దాసన్నపేట: కలెక్టర్ అంబేద్కర్‌ను జిల్లా దళిత చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు సోము మురళీమోహన్ గురువారం ఉదయం ఆయన ఛాంబర్లో కలిసి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోము మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని, ఇందుకు జిల్లా ప్రజల సహకారం తీసుకోవాలన్నారు. ● బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు, జోనల్ ఇన్‌చార్జి పీరుబండి ప్రకాశరావు గురువారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

తోటపల్లి పిల్ల కాలువకు మరమ్మతు పనులు

తెర్లాం: మండలంలో విజయరాంపురం, అప్పలంపేట, గ్రామాల మీదుగా తోటపల్లి పిల్లకాలువకు గత నాలుగేళ్లుగా నీరు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 11 వందల హెక్టార్లకు నీరందక రైతులు పలుమార్లు గత పాలకులకు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అప్పట్లో టీడీపీ ఇంచార్జిగా ఉన్న ఇప్పటి ఎమ్మెల్యే బేబీనాయన అప్పలంపేట గ్రామంలో అప్పట్లో స్వయంగా రైతుల పంటపొలాలకి వెళ్ళి రైతులతో కలసి వారి మద్దతుతో నిరసన తెలియజేశారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఎవ్వరూ స్పందించలేదు. తెలుగుదేశం పార్టీ గెలిచిన వేంటనే ఈ తోటపల్లి పిల్లకాలువకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగు నీటిని అందించే బాధ్యత తనదే అని రైతుల సమక్షంలో మాట ఇచ్చిన బేబీనాయన తోటపల్లి పిల్లకాలువ పనులను జేసీబీ సాయంతో గురువారం ప్రారంభించారు.



జేసీబీ సాయంతో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

వంగవీటి జయంతి వేడుకలు

రాజాం: దివంగత వంగవీటి మోహన్ రంగా 77వ జయంతి సందర్భంగా పట్టణ నాయకులు కేవీ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. లక్షల మందికి అండగా నిలబడిన వ్యక్తి వంగవీటి రంగా అని కొనియాడారు. జిల్లా సంయుక్త కార్యదర్శి జగదీష్, అన్నంనాయుడు, సునీల్, సత్యనారాయణ, ఎర్రన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీక్‌ను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గురువారం బంద్ నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని విద్యా సంస్థలన్నీ మూతబడ్డాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పేపర్ లీకేజ్‌కు కేంద్ర బిందువు అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



కురపాంలో..



సాలూరులో..



మక్కువలో..



జామిలో..



బొబ్బిలిలో..



వేపాడలో..

కారు ఢీకొని యువకుడి మృతి

కొత్తవలస, జూలై 4: కారు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మం డలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జామి గ్రామానికి చెందిన కొత్తలి సూర్యనారాయణ(25) బుధవారం రాత్రి కొత్తవలస వసంత్ విహార్ సమీపంలో రోడ్డు దాటుతుండగా శృంగవరపుకోట నుంచి విశాఖపట్టణం వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్ర మాదంలో సూర్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిని వ్యక్తిని చికిత్స నిమిత్తం విశాఖపట్టణం తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడి సోదరి రొంగలి దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహానికి గురువారం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో పారిశుధ్య కార్మికుడు..

డెంకాడ, జూలై 4: విద్యుత్‌షాక్‌తో పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన ఘట న మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో సింగవరం గ్రామానికి చెందిన బంగారి(54) పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం లంకపేట గ్రామంలో ఓ తాగునీటి మోటారు పంప్ వద్ద కలుపును తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కొడవలితో విద్యుత్ వైర్ల కోసేయడంతో విద్యుత్ షాక్‌కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి, ఎంపీడీవో లోవరాజు, సింగవరం సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ లెంక అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కూర్మారావు ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబసభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భోగాపురం మండలం సుంకరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని మృతుని భార్య లక్ష్మి, కుమార్తె రమణమ్మ విలపించారు.

మహిళల మెడలో బంగారం చోరీ

జియ్యమ్మవలస, జూలై 4: జియ్యమ్మవలస మండలం గడ్డతిరువాడ, పిప్పల భద్ర గ్రామాల మధ్య నడుచుకుని వెళ్తున్న మహిళల మెడలో నల్లపూసల తాడు, పుస్తెలతాడును దొంగలు తెంపుకుపోయిన ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి చినమేరంగి ఎస్ఐ చిన్నంనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో గల పరజపాడు గ్రామానికి చెందిన బోని గంగ, నక్క పోలమ్మ గడ్డతిరువాడ గ్రామంలో జరిగిన సీమంతం కార్యక్రమానికి హాజరై బుధవా రం సాయంత్రం నడుచుకుని వస్తున్నారు. ఈ క్రమంలో గడ్డతిరువాడ, పిప్పల భద్ర గ్రామాల మధ్య పల్సర్ బైక్ పై ఒక వ్యక్తి వచ్చి గంగ మెడలో ఉన్న నల్ల పూసలతాడు, పోలమ్మ మెడలో ఉన్న పుస్తెల తాడును తెంపే ప్రయత్నం చేయ గా సగం తెగి పడిపోవడంతో మిగిలిన సగం ముక్కలతో ఉడాయించారు. దీని పై మహిళలు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిద్దరిదీ కలిపి తులంనర బంగారం పోయినట్లు తెలిపారు.

లేగ దూడపై వన్యమృగం దాడి

లక్కవరపుకోట, జూలై 4: మండలంలోని రేగ గ్రామంలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వన్యమృగం లేగ దూడపై దాడి చేయడంతో దూడ మృతిచెందింది. రేగ గ్రామానికి చెందిన బొడ్డు అచ్చెంనాయుడుకు చెందిన సుమారు సంవత్సరం వయస్సు కలిగిన లేగదూడ ఈ ఘటనలో మృతి చెందడంతో అటవీశాఖాధికారులకు, పశుసంర్థక శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. ఫారెస్టుగార్డు రాజేశ్వరి గురువారం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అనంతరం తూర్పుకనుమల వన్య ప్రాణుల సంరక్షణా సొసైటీ అధికారి మూర్తి, గార్డు కలసి క్షుణ్ణంగా పరిశీలించారు. పశువుపై ఉన్న గాయాలను బట్టి ఎలుగుబంటి జాతికి చెందిన జంతువు దాడి చేసి ఉంటుందని అంచనాకు వచ్చారు. రైతు కళ్లంలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రైతులు ఒంటరిగా తిరగొద్దని సూచించారు. ఇప్పటికే కిర్ల, కొట్యాడ, తలారి, ఖాసాపేట, ఆర్జీపేట గ్రామాల్లో ఎలుగుబంటి తిరుగుతున్నట్టు సమాచారం ఉందని గార్డు తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముగ్గురి అరెస్టు

కొత్తవలస, జూలై 4: దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి గురువారం కొత్తవలస కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. జామి మండలానికి చెందిన సయ్యద్ బాషా, కొత్తలి సూర్యనారాయణ బుధవారం ఉదయం జామి నుంచి మోటార్‌సైకిల్‌పై విశాఖపట్టణం వెళ్లి రాత్రి తిరిగి వస్తూ కొత్తవలస వసంత్ విహార్ ఎదురుగా ఉన్న పాన్‌షాపులో వాటర్ బాటిల్, డ్రింకు బాటిల్ కొనుగోలు చేస్తుండగా కొత్తవలస గ్రామానికి చెందిన పి.శ్యామ్‌కుమార్ మరో ఇద్దరు యువకులు వారిని బెదిరించి వారివద్ద నుంచి డబ్బులు, సెల్‌ఫోన్‌లు దౌర్జన్యంగా తీసుకున్నారు. దీనిపై సయ్యద్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిని గురువారం అరెస్టు చేసి కొత్తవలస కోర్టుకు తరలించామన్నారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.

జామిలో తెలంగాణ విద్యార్థి అదృశ్యం

జామి, జూలై 4: జామిలో తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన 17 ఏళ్ల యువకుడు అదృశ్యం అయినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. దీనికి సంబంధించి గురువారం సాయంత్రం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన దండుగల వెంకటేశ్వర్లు జామిలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో గడిచిన ఏడునెలలుగా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో పాటు ఇక్కడే నివసిస్తున్నాడు. పదిరోజుల క్రితం వరంగల్ కాకతీయ యూనివర్శిటీలో ఇంటర్ చదువుతున్న కుమారుడు ప్రహ్లాద ఇంటికి వచ్చాడు. ఈనెల 2న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయా డని, అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారని తెలిపారు.

పరస్పర కేసులు నమోదు

రాజాం రూరల్: తన పొలంలో మొక్కజొన్న పంటను నాశనం చేసిన విషయంలో ప్రశ్నించడంతో తనపై దౌర్జన్యంచేసి కొట్టి, చంపుతానని బెదిరించినట్లు మండల పరిధిలోని పొగిరి గ్రామానికి చెందిన లోలుగు సూర్యనారాయణ అదే గ్రామానికి చెందిన లోలుగు శంకర్రావుపై గురువారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా తనకు చెందిన భూమిలో పదిసెంట్లు ఆక్రమించిన విషయం ప్రశ్నిస్తే.. తనను చేతులతో కొట్టి, చంపుతానని బెదిరించినట్లు మండల పరిధిలోని పొగిరి గ్రామానికి చెందిన లోలుగు శంకర్రావు తన తల్లితో కలిసి అదే గ్రామానికి చెందిన లోలుగు సూర్యనారాయణపై గురువారం రాత్రి రాజాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు ఇచ్చిన పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజాం టౌన్ సి.ఐ. దాడి మోహనరావు తెలిపారు. ఈ ఘటనలు ఈనెల 2న పొగిరి గ్రామంలో జరిగినట్లు సి.ఐ. తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకిరికి గాయాలు

రాజాం రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయని రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు తెలిపారు. గత నెల 29న అర్ధరాత్రి దాటాక తెర్లాం మండలం చీకటిపేటకు చెందిన అక్కివరపు బంగారి, కొన్న నగేష్ రాజాం నుంచి తన స్వగ్రామానికి నడిచి వెళ్తుండగా రాజయ్యపేట జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం వారిద్దరినీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కివరపు బంగారి తీవ్ర గాయాలపాలయ్యాడు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని కిమ్స్‌లో చేరారు. అక్కడి నుంచి వచ్చిన మెడికల్ ఇంటి మేషన్ మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కలెక్టరుకు వినతిపత్రం

బొబ్బిలి: జిల్లా మాల ఉద్యోగుల సంక్షేమసంఘం నాయకులు గురువారం జిల్లా కలెక్టరు అంబేద్కర్‌ను కలుసుకొని పలుసమస్యలపై వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షుడు కౌలు చిరంజీవులు, ప్రధానకార్యదర్శి బొక్కాన రాము, ఏగోటి మురళి, చదలవాడ సత్యనారాయణ, ఎండ గోపాలం తదితరులు పాల్గొన్నారు

అల్లూరి ఒక పోరాట స్ఫూర్తి

● కలెక్టర్ అంబేడ్కర్
● జిల్లా వ్యాప్తంగా మన్యంవీరుడు సీతారామరాజు జయంతి

కలెక్టరేట్: దేశంలో అనేక మంది స్వాతంత్ర్య సమయోధులు ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు పోరాట విధానమే ఒక ప్రత్యేకమని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరి చిత్రపటానికి అంబేడ్కర్, డీఆర్వో అనిత పలువురు జిల్లా అధికారులు పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్, డీఆర్వో అనిత మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీవో బాలాజీ, మెప్మా పీడీ సుధాకరరావు, ఉద్యాన శాఖ సూపరింటెండెంట్ వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు రాజేశ్వరి, ప్రమీల, మురళి, డీపీవో శ్రీధర్ రాజా తదితరులు ఉన్నారు. ● అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తం గా ఘనంగా నిర్వహించారు. వివిధ సంస్థలు, సం ఘాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.


గుర్ల: నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు


కలెక్టరేట్: అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్


కొత్తవలస: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి


విజయనగరం: నివాళులర్పిస్తున్న ఏఎస్పీ ఆష్మా పరహీన్


రాజాం రూరల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


జామి: ఎంపీడీవో కార్యాలయంలో...


బొబ్బిలి: నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు


ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో..


వేపాడలో..


తెర్లాం: పెరుమాలిలో..


రాజాం: ఎంపీడీవో కార్యాలయలో


గజపతినగరం: ఎంపీడీవో కార్యాలయంలో..

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేయాలి

● చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల: ఉత్తరాంధ్ర అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. సాగు, తాగునీరు, సంక్షేమ ఫలాలు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. చీపురుపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానన్నారు. అంతకుముందు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామ్మల్లిక్ నాయుడు, టీడీపీ మండల నాయకులు సన్యాసినాయుడు, కిరణ్‌బాబు, మహేశ్వరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు మంత్రి శ్రీనివాస్ రాక

దత్తిరాజేరు: మంత్రి కొండలపల్లి శ్రీనివాస్ శుక్రవారం దత్తిరాజేరు మండలానికి రానున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ గురువారం తెలిపారు. కోమటిపల్లి పెట్రోల్ బంకు పక్కన ఉన్న కేవీఎస్ శ్రీహనుమాత్ గాయత్రీ కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఈ మేరకు మండలంలో ఉన్న కూటమి పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఉచిత ఉపాధి శిక్షణను వినియోగించుకోండి

నెల్లిమర్ల: ఉచిత ఉపాధి శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని కాలేజ్ ఆన్ వీల్స్ ప్రాజెక్టు ప్రతినిధి తాలాడ దీప్తి అన్నారు. గురువారం తంగుడుబిల్లి గ్రామంలో గుడ్డ సంచుల తయారీపై ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే గుడ్డ సంచుల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. విభిన్న ప్రతిభావంతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో పాల్గొనేవారు 97036 11500 నెంబరును సంప్రదించి, తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్ నాయుడు, సీడీవో వంశీ పాల్గొన్నారు.

బోధకులను నియమించాలి

బొబ్బిలి: విద్యా బోధనకు ఎటువంటి ఆటంకం కలగకుండా వెంటనే బోధకులను గౌరవవేతనంపై నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు కోరారు. గురువారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై అధ్యయనం కోసం మండంలోని అలజంగి, పెంట, కారాడ, గున్నతోటవలస, బూర్జివలస తదితర పాఠశాలలను పరిశీలించా మని చెప్పారు. యూపీ పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, నాయకులు జి.లక్ష్మణరావు, గేదెల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేత జేసీ రాజు

మామిడితో ఆదాయం

కొత్తవలస: మామిడి తోటలు వేసుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందే వీలుందని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి అన్నారు. గురువారం అన్నన్నపాలెం గ్రామానికి చెందిన రైతు మామిడి తోటను పెంచుకునేందుకుగాను ఉపాధి పథకం ద్వారా తీసిన గుంతలను పరిశీలించారు. 2023-24 సంవత్సరాలలో చేసిన పనులను తనిఖీ చేశారు. మామిడి తోట పెంపకానికి నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఉపాధి ఏపీఎం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.


గుంతలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

108 శివలింగాలకు అభిషేకం

కొత్తవలస: మాస శివరాత్రి సందర్భంగా గురువారం తుమ్మికాపల్లి గేట్ సమీపంలోనున్న ఓం సదనంలో 108 శివలింగాలకు, ఒక మహాలింగానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. మాస శివరాత్రి సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తే లోకశాంతి కలుగుతుందని సదనం వ్యవస్థాపకుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ తెలిపారు.


108 శివలింగాలకు అభిషేకం నిర్వహించిన దృశ్యం

సమస్యలపై రికార్డులు నిర్వహించాలి

● ఎమ్మెల్యే నాగమాధవి
● చల్లవానితోటలో 'జనవాణి - మాధవమ్మ భరోసా'

పూసపాటిరేగ: ప్రతి పంచాయతీకి సంబంధించి గుర్తించిన సమస్యలు, అదే విధంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై రికార్డులు నిర్వహించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. ఎమ్మెల్యే చేపట్టిన జనవాణి-మాధవమ్మ భరోసా కార్యక్రమాన్ని గురువారం చల్లవానితోట గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకోవటంతో పాటు గ్రామస్థులు ఇచ్చిన పలు వినతిపత్రాలను పరిశీలించి, చర్చించారు. అక్కడే సంబంధిత శాఖ అధికారులతో ఆ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా గ్రామంలో పింఛన్లు, రోడ్లు, పారిశుధ్యంపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ పింఛన్లు అర్హులైన వారికి అందజేస్తామని, అయితే దీనికి కొంత సమయం పడుతుందని ఆమె తెలిపారు. అదే విధంగా గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీడీవోకు సూచించారు. రైతులు పంట ఖర్చును తగ్గించే విధంగా చూసుకోవాలని, ఇందుకు వ్యవసాయ శాఖ తగు సలహాలు, సూచనలు అందజేయాలని ఆమె కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశలో కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శివ, స్థానిక సర్పంచ్ పతివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాగమాధవి

పశువుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి: ఆర్డీవో

బొబ్బిలి: పశువుల అక్రమ రవాణాపై అధికార యంత్రాంగం ఉక్కుపాదం మోపాలని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జంతు సంక్షేమ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సాయిశ్రీ మాట్లాడుతూ పెదమానాపురం సంత నుంచి పెద్దసంఖ్యలో పశువుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోడి, గొర్రె పందాలు జరగకుండా నియంత్రించాలని, దేవాలయాలకు 300 మీటర్ల వరకు జంతుబలులు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయాలని, అన్ని పాఠశాలల్లో కైండ్‌నెస్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పెదమానాపురం సంతలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని దత్తిరాజేరు పంచాయితీ విస్తరణాధికారి వాణిశ్రీని ఆదేశించారు. అనంతరం గోమాత క్యాలెండర్లను ఆర్డీఓ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, కేవీఆర్ సత్యనారాయణ, చోళ్ల రాజకుమారి, నీలాపుదేవి, సోము వెంకటలక్ష్మి, పశుసంవర్ధక శాఖ ఏడీ నీలయ్య, ఉపవిద్యాశాఖాధికారి కె.మోహనరావు, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, ఎస్ఐ జి.లోవరాజు, ఆర్ఐ కళ్యాణచక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

విద్యార్థుల సంఖ్య పెంచాలి

కొత్తవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.బీమశంకరరావు తెలిపారు. గురువారం కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలో ఉన్న వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తరగతులతో పాటు ఎంసెట్‌కు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. అలా చేయకపోతే సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భీమశంకరరావు

అపరాధ రుసుం చెల్లించకపోతే వాహనాలు సీజ్ చేస్తాం

రాజాం: గతంలో తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు అపరాధ రుసుం చెల్లించకపోతే వాటిని సీజ్ చేస్తామని రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం రాత్రి జీఎంఆర్ఐటీ గేటు వద్ద సంతకవిటి మండల పరిధిలోని వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి చాలా మంది వాహనాలను నడుపుతున్నారని.. అటువంటి వారి విషయంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలను నడిపినపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

ధాన్యం కమీషన్ ఇప్పించండి

జామి: అన్నంరాజుపేట, జామి కోఆపరేటివ్ సొసైటీల ద్వారా 2021-22 సంవత్సరాలకు గాను రైతులకు ధాన్యం కమీషన్ ఇంతవరకు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు కోరారు. గురువారం మంత్రి కొండపల్లి శ్రీనువాస్, ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారికి ఈ సమస్యను వివరించారు. ఈ రెండు సొసైటీలు రూ.9లక్షల వరకు ధాన్యం కమీషన్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. రైతుల కమీషన్ ఇచ్చేవిధంగా చూస్తామని మంత్రి, ఎమ్మెల్యే హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పెదబాబు

కౌలు రైతు కార్డుతో ఎన్నో ప్రయోజనాలు

శృంగవరపుకోట రూరల్: కౌలు రైతు కార్డుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని.. అర్హులైన రైతులు వీటిని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవీంద్ర సూచించారు. గురువారం ధర్మవరం, వినాయకపల్లి, తలారి గ్రామాల్లో కౌలురైతు గుర్తింపు సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయకపల్లి సర్పంచ్ గనివాడ తులసి, వీఏఏ రవిచంద్ర, భాస్కర్, శిరీష ఉన్నారు.


మట్లాడుతున్న ఏవో రవీంద్ర

7న జిల్లా స్థాయి ఓపెన్‌చెస్ టోర్నమెంట్

దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని ఫైర్‌చెస్ స్కూల్లో ఈ నెల 7న అండర్ 7, 9, 11, 13 జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. వివరాలకు 74166 66567 ఫోన్ నెంబరును సంప్రదించాలని తెలిపారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ సాధనకు ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మేధావులు, కవులు, రచయితలు, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

కుక్కలకు రేపు ర్యాబిస్ టీకాలు

రింగురోడ్డు: ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేయనున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ వైవీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పశువైద్య శాలల్లో ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 28,490 యాంటీ ర్యాబిస్ టీకాలను సిద్ధం చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విత్తనశుద్ధిపై శిక్షణ

వేపాడ: చిన గుడిపాల గ్రామంలో రైతులకు విత్తనశుద్ధిపై గురువారం శిక్షణ ఇచ్చారు. విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా విత్తనశుద్ధి, బీజామృతం తయారీ, వినియోగంపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల యాంకర్ పి.నారాయణమ్మ, ఐసీఆర్పీ రమణమ్మ, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఆశీలువేలం పాట వాయిదా

గజపతినగరం: పురిటిపెంట పంచాయతీకి సంబంధించి రోజువారి ఆశీలువేలం పాట వాయిదా పడినట్టు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సుదర్శనరావు గురువారం తెలిపారు. గత ఏడాది రూ.2లక్షల 30వేలకు పాట ఖరారు కాగా, ఈ ఏడాది రూ.లక్షా 56వేలకు పాటదారులు పాటకు రావడంతో శుక్రవారానికి వాయిదా వేసినట్టు చెప్పారు. అలాగే గజపతినగం మేజర్ పంచాయతీకి సంబంధించి గురువారం నిర్వహించిన ఆశీలువేలం పాట సంచాన పైడిరాజు రూ.లక్షా 81వేలకు పాట పాడగా ఆయనకు ఖరారు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఆశీలు వసూలు చేయాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గజపతినగరం: లోగిస గ్రామం వద్దగల చంపావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ యు.మహేష్ గురువారం తెలిపారు. లోగిస గ్రామానికి చెందిన కుమిలి ఎల్లంనాయుడు చంపావతి నదిలో ఇసుక తవ్వుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడి చేశామని ఎస్ఐ చెప్పారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, నిందితుడిపై కేసు నమెదు చేశామని తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

డెంకాడ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని భోగాపురం సీఐ వేంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆయన నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. టీడీపీ నాయకుడు పాణిరాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

గంట్యాడ: మురపాక గ్రామంలోని గ్రామీణ యువజన సేవ సంఘం ఆధ్వర్యంలో గురువారం 63 మంది రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఒక్కొక్క బస్తాను రూ.900 కొనుగోలు చేసి యువజన సంఘం సభ్యులు మాత్రం రైతులకు రూ.500 చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు కోటంశెట్టి శ్రీనివాసరావు, కర్రి సురేష్, తమటాపు రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

గరివిడి: కాపుశంభాం ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైల బలరాం పాల్గొని, కిట్లు పంపిణీ చేశారు. టి.సంజీవి, సర్పంచ్ లెంక సుశీల తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం